

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. -8లో



తగ్గుముఖం పట్టిన నీరు

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో ఎండల తీవ్రత పెరగడంతో డ్యాముల్లో నీటి శాతం తగ్గుముఖం పట్టింది. దీంతో తిరుమలలో అధికారులు నీటి వృథాను అరికట్టే చర్యలు చేపడుతున్నారు.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	41	22
చిత్తూరు	39	22
తిరుమల	36	18
గూడూరు	41	24
నగరి	41	23

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6.29	4.37
చిత్తూరు	6.31	4.37
పుంగనూరు	6.33	4.41

న్యూస్‌రీల్

నిత్యాన్నదాన పథకానికి విరాళం

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన తాళ్లూరు పూజిత రూ.1,00,116, ఆలయ పాలకమండలి మాజీ సభ్యుడు ఊపూరు వేదగిరిరెడ్డి కుమారుడు ఈపూరు సతీష్‌బాబు రూ.లక్ష విరాళంగా అందించారు. ఆదివారం వారు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి నగదు విరాళాన్ని అందజేశారు.

కోనలో చలువ పందిళ్లు



ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన పందిళ్లు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. దేవాలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేయడానికి ఇబ్బంది లేకుండా ఈ ఏర్పాట్లు చేశారు. మే 1 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు దేవాలయ అధికారులు వివరించారు.

రేపటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

చంద్రగిరి: ఏపీఎస్‌బీటీఈటీ ఆధ్వర్యంలో పాలిసెట్–2023కి మంగళవారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చంద్రగిరి సమీపంలోని అగరాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 10న పాలిసెట్ ఉంటుందని, దీనికి ఈ నెల 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలు రాసిన వారు, ఇప్పటికే 10వ తరగతి పాసైన వారు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు డాక్టర్ టి. నరసింహారెడ్డి 8019729162, డాక్టర్ జి.ఎస్. హరీష్ 9493627407ను సంప్రదించాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



భరత నాట్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. తిరుపతికి చెందిన నరేష్ బృందం ఆధ్వర్యంలో చిన్నారులు భరత నాట్యం ప్రదర్శించారు. పుష్పాంజలి, మూషిక వాహన మోదక, గోవిందా శ్రిత గోకుల బృందా, గణ నాయకాయ గణదిత్య, బ్రంహ మొక్కటే పర బ్రమ్మమో ఒకటే, శివతాండవం. బో శంభో శివ శంభో, ఆకు పరాకు మమ్మేలు అమ్మ పరాకు వచ్చెను అలమేలు మంగ అటు వంటి పాటలకు కళాకారులు గురువు నరేష్, వర్షిత, ఇషా, లలన్ రాజ్, జస్వంత్, యశస్వి, రిత్విక, హేమా శ్రీ, రమ్య, హేమంత్, సురేంద్ర ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలు చేశారు. వారి ప్రదర్శనలకు ముగ్ధులైన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధకృష్ణ, పప్పి, వర ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు స్పందన నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రతిరోజు ఆర్టీసీ సర్వీసులు కలెక్టరేట్‌కు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆర్టీసీ ఆదాయార్జనలో రాష్ట్రంలోనే తిరుపతి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. కోవిడ్ సమయంలో తీవ్ర నష్టాలను చూసిన ఆర్టీసీ, తరువాత ఆదాయ మార్గాలను అన్వేషించింది. పకడ్బందీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. దీన్ని సమష్టి వ్యూహంతో అమలు చేసింది. ఫలితంగా అనూహ్యమైన విజయాన్ని అందుకుంది. రోజుకు సగటున రూ.1.5 కోట్ల చొప్పున, ఈ ఏడాది రూ.565 కోట్ల రాబడి సాధించింది. వార్షికాదాయంలో స్టేట్ ఫస్ట్ రికార్డును సొంతం చేసుకుంది.



తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీ ఆదాయంలో అగ్రస్థానం

- తిరుపతి జిల్లా స్టేట్ ఫస్ట్
- వార్షిక రాబడి రూ.565 కోట్లు
- రోజువారీ రాబడి రూ.1.5కోట్లు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా ఆర్టీసీ అధికారులు రికార్డు సృష్టించారు. రాష్ట్రంలో 2022–23లో ఆదాయార్జనలో తిరుపతి జిల్లా మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఏకంగా రూ.565 కోట్ల రాబడితో స్టేట్ ఫస్ట్‌గా నిలిచింది. కోవిడ్ సమయంలో కోల్పోయిన ఆదాయాన్ని పొందడానికి అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ప్రోత్సాహాలను ప్రకటిస్తూ, ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ ముందుకెళ్లారు. దీంతో ఈ ఏడాది రాబడిలో రాష్ట్రంలోనే తిరుపతి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు విద్యుత్ సర్వీసులకు చక్కటి ఆదరణ లభించింది. దీంతో రాష్ట్ర అధికారులు తిరుపతి జిల్లాను అభినందిస్తూ, ఆర్టీసీ సర్వీసుల విడివిభాగాలతోపాటు ఉద్యోగులను అందించడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

రాబడి మార్గాలు

- రద్దీ ఉండే ప్రాంతాల్లో అదనపు సర్వీసుల ఏర్పాటు
- ఆలయాలను కలుపుతూ ప్రత్యేక సర్వీసులు నడపడం
- తిరుమలకు అవసరమైనన్ని సర్వీసులు తిప్పడం
- ఆర్టీసీలో సమ్మెలు, వివాదాలకు తావు లేకుండా కృషి చేయడం
- కర్మాగారాలు, కళాశాలలకు ప్రత్యేక సర్వీసులు
- పండుగలు, ప్రత్యేక దినాలకు అదనపు బస్సులు
- బెంగళూరు, హైదరాబాద్, చెన్నైకి ఏసీ సర్వీసుల్లో రాయితీలు
- 500 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం
- బస్సులను కండీషన్‌లో ఉంచడం
- వివాహాలు, శుభకార్యాలకు అద్దెకు బస్సులు ఇవ్వడం

జిల్లాలో తిరుమల డిపో టాప్

తిరుమల	రూ.91.08 కోట్లు
తిరుపతి	రూ.83.60 కోట్లు
మంగళం	రూ.69.61 కోట్లు
అలిపిరి	రూ.69.30 కోట్లు
శ్రీకాళహస్తి	రూ.61.28 కోట్లు
పుత్తూరు	రూ.48.82 కోట్లు
వెంకటగిరి	రూ.35.27 కోట్లు
గూడూరు	రూ.32.74 కోట్లు
సత్యవేడు	27.52 కోట్లు
వాకాడు	23.86 కోట్లు
సూళ్లూరుపేట	22.12 కోట్లు

ఆర్టీసీ జిల్లా సమాచారం

జిల్లాలో	11 డిపోలు
ఆర్టీసీ సర్వీసులు	814
విద్యుత్ సర్వీసులు	90
ఉద్యోగుల సంఖ్య	4250
రోజు వారీ ప్రయాణికులు	5.5లక్షలు
రోజుకు ఆదాయం	రూ.1.5కోట్లు
2022–23 వార్షిక ఆదాయం	565 కోట్లు



విధుల్లో నిమగ్నమైన మహిళా కండక్టర్

జిల్లాకు గుర్తింపు లభించింది



రాష్ట్రంలో తిరుపతి జిల్లా ఆదాయంలో మొదటి స్థానం రావడంతో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. మా కష్టానికి తగినట్లు ఫలితం వచ్చింది. మేము విజయం సాధించినట్లు భావిస్తున్నాం. మరింత ఉత్సాహంతో పనిచేస్తాం. మళ్లీ తిరుపతి జిల్లానే అగ్రస్థానంలో నిలుపుతాం.

– కల్పన, కండక్టర్

ప్రథమ స్థానం రావడం సంతోషం



తిరుపతి జిల్లా రాబడిలో రాష్ట్రంలోనే ప్రమథమ స్థానం రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఉద్యోగ సంఘాలన్నప్పటికీ సమష్టిగా పనిచేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలను తూ.చా. తప్పకుండా పాటించాం. కార్మికులుగా ఉన్న తమను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులను చేశారు. కోవిడ్ సమయంలో నష్టాలున్నా సకాలంలో జీతాలిచ్చారు.

– లతారెడ్డి, కండక్టర్

మరింత ఉత్సాహంతో పనిచేస్తాం



కార్మికులందరూ ప్రభుత్వ ఉద్యోగులుగా మారడంతో శ్రద్ధగా పని చేశాం. రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తాం. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకున్నాం. డ్యూటీ విషయంలో రాజీ లేకుండా పనిచేశాం. అందరినీ కలుపుకుని పక్కా ప్రణాళికతో ముందుకు సాగడానికి డీపీటీవో చర్యలు చేపట్టారు. దీంతోనే విజయం సాధించాం.

– ఉమాశంకర్, డ్రైవర్

ఉద్యోగమంటే ప్రాణం



ఆర్టీసీ ఉద్యోగమంటే నాకు ప్రాణం. మా పని మేము చేసుకుంటూ ముందుకు సాగిపోతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలను ఐకమత్యంతో పాటిస్తున్నాం. దీంతోపాటు తిరుమల బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికంగా రావడంతో జిల్లా ఆదాయార్జనలో మొదటి స్థానంలో నిలిచింది. ఎంతో సంతోషంగా ఉంది. ఇంకా బాగా పనిచేస్తాం.

– బీయూ కుమార్, కండక్టర్

సమష్టి కృషితోనే సాధ్యమైంది



ఆర్టీసీ ఉద్యోగుల సమష్టి కృషితోనే తిరుపతి జిల్లాకు రాష్ట్రంలోనే అధిక ఆదాయం వచ్చింది. ఎప్పటికప్పుడు ఈడీలతో పాటు ఎండీ ద్వారకా తిరుమలరావు ఇచ్చిన ఆదేశాలను పాటించాం. జిల్లాలోని ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేశారు. ఉద్యోగ సంఘాల సహకారంతోనే మొదటి స్థానాన్ని దక్కించుకున్నాం. ఎంతో సంతోషంగా ఉంది.

– చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణ అధికారి, తిరుపతి

ముస్లింల సంక్షేమానికి జగనన్న కృషి



పూడి గ్రామంలో ఈద్గాను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- క్రీడలు, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- వడమాలపేటలో ఈద్గా ప్రారంభం

వడమాలపేట: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని పూడి సచివాలయం పక్కన నూతనంగా నిర్మించిన ఈద్గాను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో మసీదుల నిర్మాణాలకు, మరమ్మతులకు రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పుత్తూరు షాదీ మహల్ నిర్మాణానికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. తనను నమ్ముకొని మొదటి నుంచి పార్టీలో ఉన్న మహీన్‌కి రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి, వడమాలపేట కో–ఆప్షన్ మెంబర్‌గా బాబు సాహెబ్‌కు తగిన గుర్తింపు ఇచ్చామన్నారు. ఈద్గా కోసం స్థలం కేటాయించి, నిర్మాణం పూర్తి చేసి, ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో దీన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ముస్లింలకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ఇదే నిదర్శనమన్నారు. నగరి మండలంలో మీరా సాహెబ్ పాళెం గ్రామాన్ని దత్తతకు తీసుకొని రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు గుర్తుచేశారు. నగరిలో తమ నివాసంలో సోమవారం ముస్లిం కుటుంబ సభ్యులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీనికి అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు రాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ కుసుమ, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహీన్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, కాయం సింగిల్ విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ సోషియల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, మండల కన్వీనర్ సదాశివయ్య, సచివాలయాల కన్వీనర్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ రవి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబంతోనే మైనారిటీల అభ్యున్నతి

- 6శాతం రిజర్వేషన్లు కల్పించిన వైఎస్సార్
- మైనారిటీలకు అండగా సీఎం జగన్
- తప్పుడు కేసులతో చంద్రబాబు కుదింపు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- 26 మసీదులకు రూ.15 వేల చొప్పున పంపిణీ



పుంగనూరులో ముస్లిం సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతోనే ముస్లిం మైనారిటీలకు దేశంలోనే గుర్తింపు లభించిందని, ముస్లింలకు 6 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదేనని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలో ముస్లింలకు మంత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా మైనారిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాల చేయూతనిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని పదవుల్లో మైనారిటీలకు రిజర్వేషన్లకు మించి అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాజన్న ప్రభుత్వం 6 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, చంద్రబాబునాయుడు తప్పుడు కేసులు దాఖలు చేసి అడ్డుకున్నారని తెలిపారు. దీని కారణంగా సుప్రీంకోర్టు 4 శాతానికి కుదించిందని తెలిపారు. వైఎస్సార్ రిజర్వేషన్ల ఫలితంగా ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలకు అవకాశం లభించి, ఉన్నత స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. మైనారిటీల అభివృద్ధి వైఎస్సార్ కుటుంబంతోనే సాధ్యమైందని కొనియాడారు. మైనారిటీలకు ఏ కష్టం వచ్చినా అండగా తమ కుటుంబం ఉంటుందని తెలిపారు. ఒక్కొక్క మసీదుకు మంత్రి సొంత నిధులు రూ.15 వేలు చొప్పున 26 మసీదులకు నగదు పంపిణీ చేశారు. మంత్రిని, ఎంపీలను ముస్లింలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, నవాజ్‌బాషా, చిత్తూరు మేయర్ అముద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దిన్‌షరీఫ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అంటే ముస్లిం మైనారిటీ



ఎంపీ, ఎమ్మెల్యే అంటే ముస్లిం మైనారిటీలని, వారి ఆశీస్సులతో తాము ఎన్నికల్లో విజయం సాధిస్తున్నామని, ఈ ప్రేమాభిమానాలు ఎల్లప్పుడు అలాగే ఉంచాలని రాజంపేట పార్లమెంటు సభ్యుడు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని షాదిమహాల్‌లో జరిగిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ ముస్లింల సమాధుల వద్ద కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.2.5 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం షాదిమహాల్‌కు రూ.6 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ తొలిసారిగా ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అంజుమన్ కమిటీ వారు సమస్యలు విన్నవించారు.

● తిరుమలలో భాష్యకారుల ఉత్సవం



తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం నిర్వహించనున్నారు. శ్రీరామానుజులవారు జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది ఏప్రిల్ 25న శ్రీ భాష్యకార్ల శాత్తుమొర నిర్వహించనున్నారు. మొదటిరోజున ఆదివారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం శ్రీ రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. జీయ్యంగార్లు దివ్య ప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, పార్‌పత్తేదార్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– తిరుమల

జగనన్న వసతి దీవెన వాయిదా

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన జగనన్న వసతి దీవెన కార్యక్రమం వాయిదా పడిందని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న వసతి దీవెన 2022 –23 విద్యా సంవత్సరానికి తొలివిడత అర్హత కలిగిన విద్యార్థుల తల్లుల ఖాతాలకు రాష్ట్ర వ్యాప్తంగా జమ చేసే కార్యక్రమం వాయిదా పడిందని వివరించారు.

కథా పురస్కారానికి 'కలుంకూరి గుట్ట' ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారానికి కేవీ మేఘనాథరెడ్డి కథా సంపుటి 'కలుంకూరి గుట్ట' ఎంపిక అయ్యిందని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు, పురస్కార వ్యవస్థాపకుడు గంటా మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కథా పురస్కారానికి రాయలసీమ నుంచి 2021, 2022 సంవత్సరాల్లో ముద్రితమైన కథా సంపుటాలను పోటీకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. మొత్తం 29 మంది ప్రముఖ రచయితల నుంచి అందిన సంపుటాలలో కలుంకూరి గుట్ట పుస్తకాన్ని అత్యుత్తమంగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

● బోటుకు రెస్ట్!



ఏడాదిగా సముద్రంపై వేటాడిన మర బోట్లు ఒడ్డుకు చేరాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 15 నుంచి జూన్ 16 వరకు 61 రోజులపాటు చేపల వేటకు విరామం ప్రకటించడంతో అందుకు కట్టుబడిన మత్స్యకారులు వేటను నిలుపుదల చేశారు. బోట్లకు ఒడ్డున లంగర్ వేసి ఇళ్లల్లో సేద తీరారు. మొన్నటి వరకూ కొనుగోలుదారులు, జాలర్ల సందడితో కళకళలాడిన సముద్ర తీరం ఒక్క సారిగా బోసిపోయింది.

– వాకాడు

దేశ భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెడుతున్న మోదీ


మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ ధ్వజమెత్తారు. ఐఎఫ్‌టీయూ ఏడవ జాతీయ మహాసభలు ఆదివారం తిరుపతిలో ఘనంగా ప్రారంభమయ్యా. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్రం ప్రభుత్వం కార్మికులను దగా చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశంలోని కార్మికులు, సంఘాలు ఏకమై ఐక్య పోరాటాలు చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే మాట్లాడుతూ వివక్షకు గురైన కార్మికులు, కర్షకులపై అధ్యయనం చేయడమే తన సాహిత్య లక్ష్యమన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని అణచివేయడానికి మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు.

కదం తొక్కిన కార్మిక వర్గం

మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక వర్గం కదం తొక్కింది. విప్లవ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ జాతీయ మహా సభలు ఆదివారం తిరుపతి నగరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి వేలాది మంది కార్మికులు తరలివచ్చారు. ఎర్రజెండాలు చేత పట్టి, లక్ష్మీపురం సర్కిల్ నుంచి బైరాగిపట్టెడ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభకు అతిథులుగా రాయలసీమ అధ్యయనాల వేదిక నేత భూమన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ హాజరై ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నేతలు హరిక్రిష్ణ, పోలారి, జి.భారతి, జిల్లా నేతలు సుబ్రమణ్యం, వీఆర్.జ్యోతి, సురేంద్ర, ఏఐఎంఎస్ నేతలు వెంకటరత్నం, వెంకయ్య, కార్మికులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదలకు ఆర్థిక భరోసా

- దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు
- మహా పాదయాత్రలో మోహిత్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు
- ఉదయమాణిక్యం పంచాయతీలో విశేష స్పందన


ఉదయ మాణిక్యం పంచాయతీలో నాగలితో దున్నుతున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

భాకరాపేట: పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఎర్రవారిపాళెం మండలం ఉదయమాణిక్యం పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమం పండుగలా సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మోహిత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అంతకుముందు రెడ్డివారిపల్లిలో సర్పంచ్ లక్ష్మారెడ్డి గజమాలతో మోహిత్ రెడ్డిని సత్కరించారు. ప్రజలు హారతులు పట్టి తమ ఇంట్లోకి ఆహ్వానించారు. ప్రతి పల్లెలో స్థానిక ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మోహిత్ రెడ్డి అభాగ్యులకు ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు. పంట పొలాల్లో రైతులతో మాట్లాడారు. నాగలి పట్టి కాసేపు సరదాగా దుక్కి దున్నారు.

రూ.4.32 కోట్లతో అభివృద్ధి పనులు

ఉదయమాణిక్యం పంచాయతీలో రూ.4.32 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని మోహిత్ రెడ్డి ప్రతి గడపలో తెలియజేశారు. రూ.1.21 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, బీటీ రోడ్లు వేశామన్నారు. రూ.2.43 కోట్లతో శాశ్వత ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, కాలువలు, తాగునీటి పనులు, జగనన్న సమావేశ మందిరం, ఆర్వో వాటర్ ప్లాంట్లు, కర్మక్రియల షెడ్లు, యోగా ధ్యాన మందిరం వంటి తదితర అభివృద్ధి పనులతో ఉదయమాణిక్యం పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పంచాయతీ పరిధిని రెడ్డివారి పల్లి, దిగువరాజులపల్లి, అగ్రహారం, ఎగువరాజులపల్లి, ఎరుకలపల్లి, గడ్డంవారి పల్లి, మర్రిపాటివారిపల్లి, కాల్వకాడ తొప్పిరెడ్డి గారి పల్లి, పుట్టవాండ్లపల్లి, బావికాడపల్లి, నగరి కాలనీ, గొల్లపల్లి, తొగటపల్లి, మట్టివారిపల్లి, తొప్పిరెడ్డి గారి పల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శివలక్ష్మి, ఉదయమాణిక్యం పంచాయతీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ సురేష్, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి చెంగల్ రెడ్డి, కన్వీనర్ నాగార్జున రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, శివ నిరంజన్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ మునికృష్ణయ్య, పంచాయతీ కన్వీనర్ సుధీర్ రెడ్డి, రాజారెడ్డి, మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.63,340
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,568
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,300
రిటైల్ వెండి గ్రాము	రూ.79.30

తిరుమల ఘాట్‌లో ప్రమాదం


అదుపుతప్పి బోల్తా పడ్డ కారు

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్‌లో కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, గుంటూరుకు చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని కారులో బయల్దేరారు. 34వ మలుపు వద్ద కారు పిట్ట గోడను ఢీకొని బోల్తా పడింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: దేశంలో బీసీలకు అధిక పదవులు, పథకాలు ఇచ్చి సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పల్లంపేటలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఓసీలకే పదవులు ఉంటాయని ఎద్దేవా చేశారు. జగనన్న ఆశీర్వాదంతో నిజాయితీ పరుడైన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎమ్మెల్సీ అయ్యారని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇంతమంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరడం హర్షణీయమన్నారు. కరోనా సమయంలో రూ.5 కోట్లు సొంత సొమ్ముతో సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 35 ఏళ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉండి చేసిన అభివృద్ధి ఏమటని ప్రశ్నించారు. బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కరోనా సమయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కనిపించలేదన్నారు. ఎన్నికల సమయానికి శ్రీకాళహస్తికి వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పట్ల ప్రేమను పంచేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. టీడీపీలో పదేళ్ల కష్టించినా తమకు న్యాయం జరుగులేదన్నారు. తాను ఎమ్మెల్సీ అవుతానని కలలో కూడా ఊహించలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, నాయకులు కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటాద్రి, గోవర్ధన్‌రెడ్డి, లోకనాథ రెడ్డి, చెంగల్రాయులు, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు


గెలుపొందిన బాలబాలికలతో దివాకర్‌రెడ్డి, శ్రీనివాససూరి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా అండర్–19 బాలబాలికల చెస్ ముగింపు పోటీలు ఆదివారం యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి బాలబాలికలు హాజరు కాగా, వారికి విడివిడిగా పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో వి.త్రిపురాంబిక, వి.శ్రీగురువర్షిణి, బాలుర విభాగంలో వి.యాతిన్‌రెడ్డి, సాయిచరణ్ మొదటి రెండు స్థానాలు సాధించారు. వీరికి జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి పతకాలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. జూన్ 15 నుంచి 18వ తేదీ వరకు నంద్యాలలో జరిగే అండర్–19 రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొని విజయం సాధించాలని కోరారు. విజేతలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి హెచ్.శ్రీనివాససూరి అభినందించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ధ్వజస్తంభం వద్ద ఆర్‌బీఐ జీఎం అంజనీ మిశ్రా, డీజీఎం ఉమేష్ భార్గవ్


నీతి అయోగ్ అధికారి సంజయ్‌కుమార్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ప్రముఖ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, నీతిఅయోగ్ అధికారి సంజయ్‌కుమార్ దర్శనానికి విచ్చేయగా, ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వీవీఎస్ లక్ష్మణ్ ముందుగా రుద్రాభిషేకంలో పాల్గొని, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం ఎదుట జస్టిస్ చిల్లకూరి సుమలత

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూరి సుమలత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్


మహిళను కాపాడిన కానిస్టేబుల్ అనిల్‌కుమార్

శ్రీకాళహస్తి: ఓ కానిస్టేబుల్ మానవత్వం చాటుకున్న ఘటన పట్టణంలో ఆదివారం వెలుగుచూసింది. శాంతినగర్‌కు చెందిన రచన ప్రేమ వివాహం చేసుకుంది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో స్వర్ణముఖి నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. అయితే అటుగా వెళుతున్న బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్‌స్టేషన్‌కు చెందిన అనిల్‌కుమార్ చూసి మహిళను కాపాడి ఆమె బంధువులకు అప్పగించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

లారీ–బైక్ ఢీ: ఒకరికి తీవ్రగాయాలు


లారీ చక్రాల కింద ఇరుక్కుపోయిన బైక్

చిల్లకూరు : మండలంలో లారీ–బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, గూడూరుకు చెందిన పవన్ బైక్‌పై చింతవరానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో నాంచారమ్మ పేట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో పవన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

వరకట్న వేధింపులతో వలంటీర్ ఆత్మహత్య


సుమలత (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): వరకట్న వేధింపులు తాళలేక గ్రామ వలంటీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, చేకూరు దళితవాడలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం.. మండలంలోని దైనేడు గ్రామానికి చెందిన సుమలత నిర్మల (26) గ్రామ వలంటీర్. ఇదే మండలం, చేకూరు ఎస్సీ కాలనీకి చెందిన విజయ్‌శేఖర్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. నిత్యం మద్యం తాగి సుమలతను వరకట్నం కోసం, భార్యపై అనుమానంతో వేధించేవాడు. శనివారం రాత్రికూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో క్షణికావేశంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆమె మృతి చెందింది. వారికి మూడేళ్ల పాప ఉంది. తల్లి మృతితో చిన్నారి అనాథగా మిగిలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. సుమలత మృతి పట్ల ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

భక్తుడికి వజ్రపుటుంగరం అప్పగింత

తిరుమల : శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు తమ గదిలో పోగొట్టుకున్న విలువైన వజ్రపుటుంగరాన్ని తిరిగి వారికి అప్పగించిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. శ్రీ పద్మావతి విచారణ కేంద్రం సూపరింటెండెంట్ భాస్కర్ తెలిపిన వివరాలమేరకు.. కర్ణాటక రాష్ట్రం, బెంగళూరుకు చెందిన కె.యశ్వంత్, అతని భార్య సుప్రియ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. శ్రీ పద్మావతి విచారణ కేంద్రం పరిధిలోని బాలాజీ అతిథిగృహంలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఉదయం దర్శనానంతరం గదిని ఖాళీచేసి వెళ్లిపోయారు. ఈ సమయంలో సుప్రియ తన వజ్రపుటుంగరాన్ని గదిలో మరిచిపోయి వెళ్లిపోయింది. అనంతరం గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన పారిశుద్ధ్య సిబ్బంది ఉంగరాన్ని గుర్తించి విచారణ కేంద్రం అధికారులకు అప్పగించారు. అనంతరం ఉంగరాన్ని భక్తుడికి అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు టీటీడీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.


భక్తుడికి వజ్రపుటుంగరాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు

తిరుపతి కల్చరల్: జర్నలిస్టుల స్వేచ్ఛ, హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, ఈ నేపథ్యంలో పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ. సుబ్బారావు తెలిపారు. స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల ప్రథమ మహాసభ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. యూనియన్‌కు రాజకీయాలతో పనిలేదని, జర్నలిస్టుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా కార్యవర్గం పని చేయాలన్నారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా నూతన కార్యవర్గం

ఏపీయూడబ్ల్యూజే తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రసాద్, నరేంద్ర, ఉపాధ్యక్షులుగా ఎంఎస్.రెడ్డి, సుబ్రమణ్యం, శీనుబాబు, శ్రీకాంత్, కోశాధికారిగా చంద్రబాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మబ్బు నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శులుగా జోసెఫ్, తారక, నరసింహారెడ్డి, కోటేశ్వర బాబు, పద్మనాభంతో పాటు 12 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జయప్రకాష్, డాక్టర్ ఎం.ప్రసాద్, నాగరాజు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు మురళి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్– బైక్ ఢీ: యువకుడి దుర్మరణం

పిచ్చాటూరు: ట్రాక్టర్– బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు, ఎస్ఎస్‌బీ పేటకు చెందిన అజిత్(21), శంకర్(24) ద్విచక్ర వాహనంపై పులికుండ్రం వైపు బయల్దేరారు. మార్గమధ్యంలో పులికుండ్రం వద్ద ఎదురుగా వస్తున్న చెరుకు ట్రాక్టర్ ట్రాలీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో అజిత్ అక్కడికక్కడే మృతి చెందగా, శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్, బైక్‌ను పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అతివేగానికి ఇద్దరు బలి

- ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదం
- తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకుల దుర్మరణం


మృతి చెందిన తమిళనాడుకు చెందిన యువకులు యువరాజు, విశ్వకుమార్

వరదయ్యపాళెం: ద్విచక్ర వాహనంపై అతివేగంగా ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని ఉబ్బలమడుగుకు వెళ్లే మార్గంలో జరిగింది. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై పూందమల్లి సమీపంలోని వసంతపురం ప్రాంతానికి చెందిన యువరాజు (19), విశ్వకుమార్ (17) ద్విచక్ర వాహనంపై వరదయ్యపాళెం సమీపంలోని ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి ఆదివారం ఉదయం బయలుదేరారు. మరో 10 నిమిషాల్లో పర్యాటక కేంద్రానికి చేరుకునే సమయంలో వరదయ్యపాళెం–ఉబ్బలమడుగుకు వెళ్లే అవంతి రోడ్డు మార్గంలోని గోవిందరాజు దరఖాస్తు వద్ద ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చిన రోడ్డు పక్కనే ఉన్న వినాయకస్వామి గుడిని ఢీకొట్టారు. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువరాజు, విశ్వకుమార్ తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం మృత దేహాలను సత్యవేడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.